## క్లుప్తంగా

### తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలి

వర్ధన్నపేట : వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అధిక మెజార్టీతో గెలిపించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కోరారు. ఆదివారం ఖిలా వరంగల్ మండలం పెన్షన్‌పూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మైస సురేష్‌కుమార్, నాయకులు ఐత ప్రవీణ్‌కుమార్, చీటూరి రాజు, దుబ్బాక శివ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖానాపురం: మండలంలోని మంగళవారిపేట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ డీఈ శ్రీధర్, ఏఈ సంపత్‌లు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారిపేట సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటనెన్స్‌లో భాగంగా అంతరాయం ఉంటుందని తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని, విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

చెన్నారావుపేట: మండలంలోని చెన్నారావుపేట ఫీడర్ పరిధిలోని 33 కేవీ లైన్ మెయింటెనెన్స్ పనులు జరుగుతున్నాయని డీఈఈ శ్రీధర్, ఏఈ జోగానంద్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 33 /11 కేవీ చెన్నారావుపేట, అమీనాబాద్ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

### ఎంకే సంఘం అధ్యక్షుడిగా మల్లేశం



గీసుకొండ: గ్రేటర్ వరంగల్‌లోని 16వ డివిజన్ ధర్మారం శ్రీ గణపతి మున్నూరు కాపు(ఎంకే) సంఘం అధ్యక్షుడిగా నాసం మల్లేశం ఎన్నికయ్యాడు. ఆదివారం సంఘం ఎన్నికలు నిర్వహించగా గౌరవ అధ్యక్షుడిగా పొడాల మల్ల య్య, ఉపాధ్యక్షుడిగా ఆరె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గోపాల శ్రీనివాస్, కోశాధికారిగా పొడాల లింగమూర్తితో పాటు కొట్టె కుమారస్వామి, బండారి యుగేందర్, బండారి రాజేందర్, బొల్లం అశ్విని, నాగరాజులు ఎన్నికైనట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.

### ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

వర్ధన్నపేట: మండలంలోని ఇల్లందలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి రాగి విశ్వరూపచారి వేదమంత్రాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పుర వీధుల్లో ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షుడు మంచోజు సత్యనారాయణ, ఇల్లంద గ్రామ అధ్యక్షుడు శంకపల్లి కనకాచారి, విగ్రహదాత పాడిశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యతోనే సమాజంలో గుర్తింపు



సంగెం: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని అన్నారు. మార్గం స్వచ్ఛంద సేవా సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఉచిత వేసవి శిబిరాన్ని ఆయన సందర్శించి విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని పేద విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకుని వచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు తరగతి గదికే పరిమితం కాకుండా చదువుతో పాటుగా ఇతర ఆటలు, పాటలు, సాహిత్య, ఇతర సృజనాత్మక కళా రంగాల్లోను ప్రావీణ్యం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ సురేష్, సింగారపు బాబు, తదితరులు పాల్గొన్నారు.

### తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

చెన్నారావుపేట: మండల కేంద్రానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఎదురబోయిన వీరమల్లు(35) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. వీరమల్లుకు ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. గత సంవత్సరం కుమారుడు ఉరివేసుకుని చనిపోయాడు. కుమారుడు లేకపోవడంతో కుమార్తె రవళి తండ్రికి తలకొరివి పెట్టింది. సంఘం మండల అధ్యక్షుడు బండి ఉపేందర్, గ్రామ అధ్యక్షుడు తెప్ప రమేష్, సీఐటీయు మండల అధ్యక్షులు అల్లాడి వెంకటనారాయణ, కార్యదర్శి బండి శ్రీనివాస్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# మూత'బడుల' పునరుద్ధరణ జరిగేనా!

- మండలంలో 17 ప్రాథమిక పాఠశాలల మూసివేత
- గ్రామాల్లో పాఠశాలల అడ్రస్ గల్లంతు
- కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటనతో గ్రామాల్లో చిగురిస్తున్న ఆశలు



గ్రామపంచాయతీ భవనంగా ఉపయోగిస్తున్న బీకోజీనాయక్ తండా పాఠశాల

సంగెం : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకుండా విద్యార్థులు లేరంటూ మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి పునరుద్ధరణ జరిగేనా అంటూ గ్రామాల్లో చర్చ మొదలైంది. రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ప్రతీ జీపీకి ప్రభుత్వ పాఠశాల ఉండాలనే నిర్ణయంతో మూసేసిన బడులను తిరిగి పునరుద్ధరిస్తామని ప్రకటించిన విషయం విధితమే.

**తెరుచుకునేవెన్నో...**

విద్యార్థులు లేరని, గతంలో మండలంలోని కృష్ణానగర్, కుంటపల్లి ప్రాథమిక పాఠశాలలు చాలా ఏళ్ల క్రితం మూతపడగా తర్వాత ఏడాదికి కొన్ని చొప్పున బాలునాయక్ తండా, కొత్తపల్లి, తూర్పు తండా(ఎన్), తూర్పు తండా(ఇ), వంజరపల్లి, ముమ్మడివరం, ఎల్గూర్‌తండా, ఆర్‌సీ తండా, ఏఎస్ తండా, కుమ్మరిగూడెం, సోమ్లతండా, పుటాన్‌తండా, గొల్లగూడెం, వడ్డెర గూడెం, బీకోజీనాయక్ తండా ఇలా 17 పాఠశాలలు మూతబడ్డాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు సరైన అవగాహన కల్పించకపోవడం, ఆంగ్ల మాధ్యమంపై ఆకర్షణ వెరసి విద్యార్థుల సంఖ్య క్రమక్రమంగా తగ్గి పాఠశాలలు మూసివేసే పరిస్థితి వచ్చింది. వీటిలో ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ విద్యార్థులు లేకపోవడంతో వాటిని మూసివేసి అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు బదిలీచేశారు. దీంతో మూతబడిన పాఠశాలలు పిచ్చిమొక్కలు మొలచి అధ్వానంగా మారాయి. గొల్లగూడెం, ఆర్‌సీ తండ, ముమ్మడివరం, వంజరపల్లి, కుమ్మరిగూడెం, కుంటపల్లి తదితర పాఠశాలలను గ్రామపంచాయతీలుగా మార్చారు. దీంతో ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఒకప్పుడు ఉండేవని వాటి అడ్రస్‌లు గల్లంతై వాటిని నేడు జీపీలుగా పిలుస్తున్నారు. మరికొన్ని ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలున్నాయి. పాఠశాలలు మూతపడినప్పటికీ ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు కొనసాగుతూ డిప్యుటేషన్‌పై ఇతర పాఠశాలల్లో పనిచేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు మూతపడడంతో కొన్ని గ్రామాల్లోని ప్రజలు వారి పిల్లలను వ్యయప్రయాసకోర్చి ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పాఠశాలలు లేక విద్యార్థులు కిలోమీటర్ల పైగా నడిచివెళ్లి చదువుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం కిలోమీటరు లోపు ప్రాథమిక, మూడు కిలోమీటర్ల లోపు ప్రాథమికోన్నత, 5 కిలోమీటర్ల లోపు ఉన్నత పాఠశాల ఉండాలి. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లోను ఆంగ్ల మాధ్యమంలో బోధన చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు స్పందించి తమ గ్రామాల్లోని బడీడు పిల్లలందరినీ పాఠశాలలకు పంపించే విధంగా చర్యలు తీసుకుంటే తిరిగి ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం వస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



మూతపడి వృథాగా ఉన్న ఆర్‌సీ తండా పాఠశాల

### ఆదేశాలు రాగానే చర్యలు చేపడతాం



ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఇంకా రా లేదు. పాఠశాలలు మూతపడిన గ్రామాల్లో బడీడు పిల్లలు ఎంత మంది ఉన్నారు. పాఠశాలలు తెరిచే అవకాశాలు ఎంతవరకు ఉన్నాయనే విషయాలను సీఆర్పీలు, గ్రామ కార్యదర్శులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం. అనుమతులు రాగానే ఈ విద్యాసంవత్సరం నుంచే మూతపడిన పాఠశాలలు తెరిచే అవకాశం ఉంది.

– నక్క విజయ్‌కుమార్, ఎంఈఓ సంగెం

# మహాయిష్టియాగ మహోత్సవం



యాగంలో పాల్గొన్న భక్తులు

నర్సంపేట : పట్టణంలోని భునీల సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు ముడుంబాయ్ వెంకటాచార్య దివ్య సంకల్పం విశ్వశాంతి కోసం అంకురారోపణ చేసి ఆదివారం పుణ్యక్షేత్రం శ్రీయాదగిరిగుట్ట నక్షత్ర వనవృక్ష క్షేత్రంలో వైశాఖ మాసం శుద్ధ ఏకాదశి సామూహిక షష్టిపూర్తి మహోత్సవం నిర్వహించారు. మహాయిష్టి యాగం ధరణిశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వశాంతి కోసం యిష్టి యాగం నిర్వహించారు. వేడుకలకు విశ్వక్సేన పుణ్యాహవచన పూజాధికాలనంతరం ముఖ్య అతిథులుగా త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ వ్రతధర జీయర్‌స్వామి, వననక్షత్ర వృక్ష స్థల యజమాని గట్టు రంగాచార్య పండితులు రుత్విక్కుల వేదమంత్రాల మధ్య తొమ్మిది హోమ గుండాలలో హోమ పూజలు చేశారు. ఇష్ట కార్యసిద్ధి కోసం విద్య, ఉద్యోగ, వ్యాపార, వివాహ, ఆరోగ్య, కుటుంబంలో కలతలు, నవగ్రహదోష, నరఘోష సమస్యలతో ఈతి బాధత నివారణ కోసం దంపతులు సఖ్యత, షష్టిపూర్తి చేసుకున్న దంపతులు 260 మంది పాల్గొన్నారు. ముఖ్య అతిథి శ్రీవ్రత ధర జీయర్‌స్వామి అనుగ్రహ బాషణం చేశారు. గట్టు రంగాచార్య దేవి ఉపాసకులు మాట్లాడుతూ విజయలక్ష్మి అమ్మ వారికి ఉపాసన చేస్తూ హైదరాబాద్ నుంచి తిరుమల వరకు కాలినడకన వెళ్లి అలివేలు మంగ, శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకొని తిరిగి యాగిరి గిరి ప్రదక్షిణ చేసి లక్ష్మి నర్సింహస్వామి కల్యాణం చేయించామని, ప్రకృతి జీవుడు మధ్య నలుగురికి ఆర్థికసాయం చేసే విధంగా మానవుడు ఉండాలని తెలిపారు. యాగకర్త శ్రీవెంకటాచార్య మాట్లాడుతూ యిష్టి యాగంలో వారి వారి నక్షత్రాలపై హోమాదిక పూజలు చేయించారు. అనంతరం శస్త్యబ్ధి దంపతులకు అవభృద స్నానం, అనంతరం యాగ హోమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఋత్వికులు కృష్ణమాచార్య, మాధవాచార్య, రంగనాథాస్వామి, శ్రీఖర్, వెంకటాచార్య, హరికృష్ణమాచార్య, తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి కృతజ్ఞతలు



మాట్లాడుతున్న నరేశ్

నర్సంపేట : కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్లర్‌పై విచారణకు ఆదేశాలు జారీ చేసిన తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంకు ఏబీఎస్ఎఫ్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం ఏబీఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ మాట్లాడుతూ కేయూ వీసీపై గత మూడు నెలల క్రితం అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడని యూనివర్సిటీ పరిధిలో ఉన్న అన్ని విద్యాసంఘాలు, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు, రిలే నిరాహార దీక్షలు చేయడం జరిగిందన్నారు. యూనివర్సిటీ పరిధిలో పీహెచ్‌డీ, కాంట్రాక్ట్ లెక్చరర్స్, బదిలీలు, అభివృద్ధి విషయంలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్‌కు ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేష్ స్పందించి శనివారం విచారణకు ఆదేశాలు జారీ చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రమేష్, సుమన్, రవి, వినయ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలి



నల్లబెల్లి : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



దుగ్గొండి: పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం కార్యకర్తలు

నర్సంపేట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోరబోయిన కుమారస్వామి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడు, కుల వ్యవస్థను నిరసించిన సుందరయ్య అసలు పేరు పుచ్చలపల్లి సుందరరామిరెడ్డిలోని రెడ్డి అనే కుల సూచికను తొలగించుకున్నాడని కొనియాడారు.సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్, పట్టణ కమిటీ సభ్యులు బాలకృష్ణ, కందికొండ రాజు, అనిల్, జగనాథం, కార్తీక్, వజ్జంతి విజయ, స్వప్న, నాగమణి, విలియం కేరి, నరేష్, రాజేష్, పాల్గొన్నారు.

**సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి**

నల్లబెల్లి: సీపీఎం వ్యవస్థాపకుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కడియాల మనోహర్ అన్నారు. మండలం కేంద్రంలో సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కడియాల వీరాచారి, బొడిగె సమ్మయ్య, లింగయ్య,క్రాంతికుమార్, రవి, నారాయణ స్వామి, సుజాత పాల్గొన్నారు.

**మహోన్నత నేత 'పుచ్చలపల్లి'**

దుగ్గొండి: మండలంలోని గిర్నిబావిలో కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈసంపల్లి బాబు మాటాడారు. కార్యక్రమంలో నాయకులు పుచ్చకాయల నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, అక్కపెల్లి సుధాకర్, చల్ల నర్సింహారెడ్డి, కోడెం రమేష్, కల్వల సుధీర్, కటకం సాంబమూర్తి, పొన్నం రాజు, శివరాత్రి సాంబయ్య పాల్గొన్నారు.

### ఘనంగా బ్రహ్మోత్సవాలు



నల్లబెల్లి : మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఏకదశి రోజును పురస్కరించుకొని 10వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా ఆదివారం నిర్వహించారు, ఆలయ రాజపోషకులు కొండ కృష్ణస్వామి, పురోహితులు తిరునగరి వెంకటేశ్వర్లు స్వామివారికి అభిషేకం, ధ్వజారోహణ హోమాలతో పాటు తదితర పూజలు నిర్వహించి స్వామి వారి కల్యాణం జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు కొండా లక్ష్మణస్వామి, భాస్కరస్వామి పాల్గొన్నారు.

### కళేబరాన్ని తరలించిన సిబ్బంది

రాయపర్తి: మండలంలోని మైలారం వరంగల్ -ఖమ్మం జాతీయ రహదారిపై గేదెను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో గ్రామపంచాయతీ సిబ్బంది అక్కడికి చేరుకొని గేదె కళేబరాన్ని పొక్లెయినర్ సాయంతో దూరప్రాంతానికి తీసుకెళ్లి ఖననం చేశారు. దీంతో జీపీ సిబ్బందిని అక్కడున్నవారు అభినందించారు.

# బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి



నర్సంపేట : ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సంపేట: త్వరలో జరుగబోయే నల్గొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, పట్టణ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ గోనె యువరాజులు కోరారు. పట్టణంలో రాకేశ్‌రెడ్డి గెలుపు కోరుతూ ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీని బలోపేతం చేస్తూ రాకేష్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ బాధ్యులు బండి రమేష్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, మూడో వార్డు అధ్యక్షుడు బీరం నాగిరెడ్డి, 148వ బూత్ కన్వీనర్ దేవోజు హేమంత్, రెండో వార్డు అధ్యక్షుడు బాబు, 149వ బూత్ కన్వీనర్ కమల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**కేసీఆర్ చేసిన అభివృద్ధిని వివరించాలి**

నల్లబెల్లి: కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి అన్నారు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏనుగుల రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని నందిగామ, రేలకుంట, రంగాపురం, ముచ్చింపుల, దస్తగిరిపల్లి, బోల్లోనిపల్లి, అర్వయ్యపల్లి, శనిగరం గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆదివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, బొట్ల పవన్, గందె శ్రీనివాస్ గుప్తా, కొత్తపల్లి కోటిలింగాచారి, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



వర్ధన్నపేట: బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే



రాయపర్తి: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో మృతి చెందిన మండలంలోని డీసీతండాకు చెందిన ఆంగోతు వాసు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా అధికారప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, పట్టణ అధ్యక్షుడు మైస సురేష్, వర్ధన్నపేట మున్సిపాల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, కౌన్సిలర్ సమ్మెట సుధీర్‌గౌడ్, పులి శ్రీనివాస్, ఐత ప్రవీణ్‌కుమార్, చీటూరి రాజు, ఉన్నారు.

**మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ**

రాయపర్తి: మండలంలోని వెంకటేశ్వరపల్లి మాజీ సర్పంచ్ గూబ యాకమ్మ ఎల్లయ్య కుమార్తె వసంత పర్వతగిరి మండలం అన్నారంలో ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. గ్రామానికి వసంత మృతదేహాన్ని తరలించగా బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి పూస మధు ఉన్నారు.

**పరామర్శ**

రాయపర్తి: మండలంలోని జయరాంతండాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుగులోతు శంకర్ నానమ్మ గుగులోతు మారోనీ ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు గ్రామాన్ని చేరుకొని మారోని మృతదేహం వద్ద నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, మండల సీనియర్ నాయకుడు సరికొండ కృష్ణారెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు వెంకన్న, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు చిర్ర మల్లయ్య తదితరులు పరామర్శించారు.

**స్నేహితుడి కుటుంబానికి చేయూత**



నల్లబెల్లి : సునీల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తూ ..

నల్లబెల్లి : తమతో కలిసి చదువుకున్న చిన్ననాటి స్నేహితుడు మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన గుర్రపు సునీల్(32) ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ములుగు జిల్లా మల్లంపల్లి భవాని హైస్కూల్‌లో 2007–08 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితుడి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. సునీల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తోటి స్నేహితుల నుంచి సేకరించిన రూ.50 వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. పరామర్శించిన వారిలో రణధీర్, మౌనిక, అనిల్ కుమార్, అజయ్, రాకేష్, నాగరాజు, రాము, కృష్ణ, రవితేజ, వినయ్, పూజిత, తదితరులు ఉన్నారు.

# పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





వర్ధన్నపేట: నాటి ఉపాధ్యాయులతో విద్యార్థులు



గీసుకొండలో ..

వర్ధన్నపేట: మండలంలోని ఇల్లంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996–97 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అలనాటి పూర్వ ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. చిన్ననాటి స్మృతులను నెమరువేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యాయుడు జయపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పూర్వవిద్యార్థులు గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, ప్రముఖ యోగా గురువు శ్రీనివాస్, రాము, శ్రీధర్, శోభన్‌బాబు, పాల్గొన్నారు.

గీసుకొండ : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2007–08 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించడంతో పాటు ఒకరినొకకు ఆత్మీయంగా పలకరించుకుంటూ తమ జీవిత అనుభవాలను పూర్వ విద్యార్థులు నెమరువేసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులు వీరభద్రశర్మ, వేముల సాంబయ్య, ముత్తినేని జయలక్ష్మి, ఐత శ్రీ దేవి, కర్ణకంటి రాంమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట: మండలంలోని జల్లిలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2003–04 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఒక్కటిగా కలుసుకు పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం చదువునేర్పిన గురువులను సన్మానించారు.

### వందేళ్ల ఆగమ్మకు సన్మానం



నర్సంపేట: పట్టణం శివాజీనగర్ రోడ్ గౌడ సంఘం సమీపంలో ఉండే వేముల ఆగమ్మ వందవసంతాలు పూర్తి చేసుకోగా ఆమె మనవళ్లు ఆదివారం పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆగమ్మ మాట్లాడుతూ మనిషిలో స్వార్థం, కుళ్లు, కుతంత్రం లేకుండా ప్రజలందరూ ఐకమత్యంతో ఉండాలని కోరుకుంటే మనకు ఎలాంటి ప్రమాదం ఉండదని ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ ఆగమ్మను శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆగమ్మ వేముల వంశంలో కొడుకుల నుంచి మనవల వరకు తలలో నాలుకలా మెదిలేదని అన్నారు. కార్యక్రమంలో నర్సంపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు వేముల సారంగంగౌడ్, వేముల పరపతి సంఘం కార్యదర్శి వేముల కృష్ణప్రసాద్‌గౌడ్, వేముల రాజు, వేముల శ్రీధర్, కట్టస్వామిగౌడ్, అభినవ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### రైతన్నకు తప్పని తిప్పలు



లారీపై టాటిపత్రి కప్పడానికి సిద్ధమవుతున్న రైతులు

ఖానాపురం: ఆరుగాలం కష్టపడి పంటల సాగు చేసే రైతన్నకు తిప్పలు మాత్రం తప్పడం లేదు. పాకాల ఆయకట్టులో వరి ధాన్యపు రాశులు భారీగా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం వాతావరణంలో భారీగా మార్పు చోటు చేసుకుంది. సబ్‌మార్కెట్ యార్డులో లారీలో ధాన్యపు బస్తాలను లోడుచేసే క్రమంలో భారీ వర్ష సూచన కనబడటంతో రైతుల గుండెల్లో రైళ్లు పరుగులెత్తాయి. దీంతో ధాన్యాన్ని కాపాడుకోవడానికి ఉక్కిరిబిక్కిరి అవుతూ అష్టకష్టాలు పడ్డారు.